క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఉయ్యాలవాడ: ద్వాదశిని పురస్కరించుకుని మండలంలోని ఆర్.జంబుల దిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయ స్వామి, లక్ష్మి నరసింహ కంబగిరిస్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు, ఆకుపూజ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. భక్తులకు అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గ్రామ రెవెన్యూ సహాయకుడి మృతి



మృతుడి కుమారుడికి నగదు అందజేస్తున్న జూనియర్ అసిస్టెంట్

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామ రెవెన్యూ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న తోట శేఖర్(60) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సుభద్ర, డీటీ మాధవ్, సిబ్బంది నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం జూనియర్ అసిస్టెంట్ చిన్నగోవిందు రూ.25 వేలను మృతుడి కుమారుడు సంజీవ సాగర్‌కు అందజేశారు. అలాగే వీఆర్ఏలు తిరుపాల్, బాషా, వెంకట సిసీంద్రి, శాంతకుమార్, గోరే సాహెబ్ తదితరులు రూ.10వేల ఆర్థిక సాయం చేశారు.

మినీ గోకులాలు ప్రారంభం



కోటకందుకూరులో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ: మండలంలోని కోటకందుకూరు గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్లను ఎమ్మెల్యే అఖిలప్రియ శనివారం ప్రారంభించారు. పాడిరైతులు మినీ గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్ ఖాన్, ఏపీఓ గణేష్ ఉన్నారు.

పంట నష్ట పరిహారం అందించాలి



కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): మండలంలోని పాండురంగాపురం గ్రామంలో కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని భారతీయ జనతా కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాండురంగాపురం గ్రామంలో మొక్కజొన్న రైతులు వందల ఎకరాల్లో కల్తీ విత్తనాలు నాటి రూ.లక్షల్లో నష్టపోయారని, వారికి పరిహారం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు శివారెడ్డి, రామచంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, గురుబ్రహ్మం పాల్గొన్నారు.

పెరిగిన హుండీ ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని స్థానిక గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు కార్యక్రమం శనివారం ఈఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ హుండీ ద్వారా రూ.2,90,869 ఆదాయం లభించిందని, గత ఏడాది కంటే రూ.12,823 అధికంగా సమకూరిందని తెలిపారు. తనిఖీ అధికారి హరిశ్చంద్రారెడ్డి, ఆలయ అర్చకులు ప్రహ్లాదవరదాచారి, కృష్ణమాచారి, గాజుల శీను, మురళీ, దండెశీను పాల్గొన్నారు.

స్కూటర్ దహనం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని రోజాకుంట వీధిలో హోటల్ యజమానికి చెందిన స్కూటర్‌ను శనివారం వేకువజామున గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టారు. బాధితుడు సూర్యారావు తెలిపిన వివరాల మేరకు.. రోజాకుంట వీధిలో సూర్యారావు తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. శుక్రవారం రాత్రి హోటల్ మూసి వేసి ఇంటికి వచ్చి స్కూటర్‌ను ఇంటి బయట పార్క్ చేశాడు. ఉదయం నిద్రలేచి చూడగా మంటల్లో కాలిపోయి ఉండటాన్ని గమనించి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



భోగిమంటలు వేసిన మహిళలు



హరిదాసుకు దానం చేస్తున్న మహిళలు

ముందస్తు సంక్రాంతి సంబరాలు

నూనెపల్లె ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం నూనెపల్లె అమ్మవారి శాలలో అధ్యక్షురాలు కళావతమ్మ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, చిన్న పిల్లలకు భోగి పళ్లు పోయడం, గాలి పటాలు ఎగురవేయడం, కోలాట, నృత్యాలు, హరిదాసు పాటలు, భోగి మంటలు వేశారు. రాజేశ్వరమ్మ, జ్యోత్స్ను దేవి, పుష్ప, కల్యాణి పాల్గొన్నారు. -నంద్యాల(వ్యవసాయం)

భక్తులకు అన్నదానం

పట్టణంలోని కోటావీధిలో వెలసిన శ్రీరమా సమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆలయ చైర్మన్ యాడికి శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి ప్రతి శనివారం స్వామివారికి పూజ అనంతరం 150 మందికి పైగా భక్తులకు అన్నవితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఈఓ నాగప్రసాద్ పాల్గొన్నారు.



సత్యనారాయణ స్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం



ఈ చిత్రంలో పిండివంటలను చూపుతున్న మహిళ భాగ్యలక్ష్మి. వారే స్వయంగా చేసిన పిండి వంటలను చూస్తుంటే ఇప్పుడే నోరూరేలా ఉన్నాయి. మురుకులు, అరిసెలు, కొబ్బెరి బూరెలు, ఉప్పు చెక్కలు, లడ్డు, కారాలు, వాముపూస ఇలా ఎన్నో రకాల పిండివంటలను తయారు చేస్తామంటున్నారు. ఎందుకు ఇన్ని చేశారు.. ఎమైనా స్వీట్ స్టాల్ కోసమా అన్నట్లుగా ఉన్నాయి కదూ. ఔను చూసేవారికి అలానే అనిపిస్తుంది. ఎందుకంటే ఒకేసారి పండుగకు యాభైమంది దాకా వస్తారు. వారికి తినేందుకు సరిపడా ఉండాలి కదా. అలాగే వారు తిరుగు పయనంలో వారి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు సంచుల్లో పార్సిల్ తీసుకుపోవాలి కదా అంటున్నారు.



ఈ చిత్రంలో లగేజీ సర్దుకుంటున్నది డాక్టర్ ఉష. ఆమె భర్త అరుణ్ కుమార్. ఇద్దరూ వృత్తిరీత్యా హైదరాబాద్‌లో వైద్యులుగా పనిచేస్తున్నారు. ఏటా సంక్రాంతికి భాగ్యనగరం వస్తాం. అమ్మనాన్నలు, అత్తమామలతో కలిసి మూడు రోజులు సందడి చేస్తాం. సంక్రాంతి పండుగ అంటే బంధువులందరినీ కలిపే పండుగా భావిస్తామంటున్నారు.

సంక్రాంతికి వస్తున్నాం!

- పల్లెల్లో పిండివంటలు ప్రారంభం
- మొదలైన సంక్రాంతి సందడి
- గ్రామాలకు బయలుదేరిన పట్టణవాసులు

సంక్రాంతి పండుగ అంటేనే అందమైన ముగ్గులు.. గొబ్బెమ్మలు.. హరిదాసు పాటలు.. బసవన్న ఆటలు.. పిండివంటలు.. గాలిపటాలు ఇలా మరెన్నో సంబరాలకు ప్రసిద్ధి. ఈ పండుగ పంటల పండుగ అని..మార్పు తెచ్చే పండుగ అని..పెద్దల పండుగ అని అంటుంటారు. మన పూర్వీకులు 33 రోజులు జరుపుకునే వారు. ఇప్పుడు కాలానికి తగ్గట్టుగా అంత సమయం లేక ఏటా జనవరిలో భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులు జరుపుకుంటున్నాం. సంక్రాంతి సంబరాలపై సాక్షి ప్రత్యేక కథనం.

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం, రామచంద్రాపురం, అమ్మిరెడ్డినగరం, ఉమాపతినగరం గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుతారు. ఎందుకంటే వీరు కోస్తా ప్రాంతం నుంచి వలస వచ్చారు. అందుకే అలాంటి వాతావరణం ఉట్టిపడేలా చేస్తారు. ఊరంతా ముగ్గులు, ఇంటికి చుట్టాలు, బంధువులు, ఆడపడుచులు ఇలా ఇంటి నిండా పిల్లాపాపలతో కోలాహలం కనిపిస్తుంది.

లొట్టలేసుకుని తినాల్సిందే

కరకరలాడే చెక్కలు, మధురమైన లడ్లు, ఆరగించేలా అరిసెలు ఇలా ప్రతి అన్ని పిండి వంటకాలు గ్రామాల్లో తయారు చేయడం ఆనవాయితీ. బయటి తినుబండారాలను ఏమాత్రం తెచ్చుకోకుండా ఏటా ఇలా ఇళ్ల వద్దనే ఐదారుగురు మహిళలు కలిసి కబుర్లు చెప్పుకుంటూ నోరూరే పిండివంటకాలను తయారు చేసి డబ్బాల్లో నిల్వ ఉంచుతారు.

అచ్చం కోస్తాలాగే

సంక్రాంతి అంటే కేవలం కోస్తా ప్రాంతానికే పరిమితం అంటారు. అచ్చం కోస్తాను తలపించేలా భాగ్యనగరం, ఉమాపతినగరం, రామచంద్రాపురం, అమ్మిరెడ్డినగరం, వెంకటేశ్వరనగరం గ్రామాల్లో సంక్రాంతి పండుగను వైభవంగా చేస్తారు. వీరంతా సుమారు ఆరుదశాబ్దాల క్రితం ఇక్కడికి వలస వచ్చారు. కానీ ఇప్పటికి వారు పండుగలను చాలా సంప్రదాయంగా జరుపుతారు. ముఖ్యంగా వీరు కలిసికట్టుగా సంక్రాంతిని జరుపుకుంటారు.

భోగభాగ్యాలు పంచేలా 'భోగి'

భోగి రోజున వేకువజాము నుంచే భోగిమంటలు వేసి సంక్రాంతికి ప్రారంభం పలుకుతారు. అనంతరం చిన్నారులకు రేగిపళ్లతో స్నానాలు చేయించి వంటలు ప్రారంభిస్తారు. నాటుకోడి చికెన్, దోశలు వంటి వాటిని చేసుకుని ఆరగిస్తారు. అనంతరం ఇళ్లను శుభ్రం చేసుకుంటారు.





భాగ్యనగరంలో పిండివంటలు తయారు చేస్తున్న మహిళలు

సం'క్రాంతి' రోజున

సంక్రాంతి రోజున ఇళ్ల ముంగిట ముగ్గులు వేసి గొబ్బెమ్మలను ఉంచి శుభారంభం పలుకుతారు. అనంతరం తీపి వంటలు చేసి పెద్దలకు నూతన బట్టలు పెట్టి మొక్కులు చెల్లించుకుంటారు. అలాగే గ్రామంలోని స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి తెప్పోత్సవం నిర్వహిస్తారు.

సందడే సందడి



వృత్తి రీత్యా నంద్యాలలో ఉంటున్నాం. మా స్వగ్రామం ఎన్నటికి మరువం. మా పిల్లలతో కలిసి ప్రతి ఏటా సంక్రాంతికి వచ్చి సందడి చేస్తాం. మా గ్రామంలో జరిగే సీతారాముల గ్రామోత్సం, తెప్పోత్సవం ఎంతో కనువిందుగా ఉంటుంది.
-ఉమాదేవి, గ్రామ సర్పంచి, రామచంద్రాపురం

కను'విందు'గా కనుమ

కనుమ రోజు ఇంటింటా ప్రత్యేక వంటలు చేసుకుని ఆరగిస్తారు. కోళ్లు, మేకలను వదలడం.. ఎవరు పట్టుకుంటే వారికి ఇవ్వడం వంటి పందేలను కొనసాగించి ముగింపు పలుకుతారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్, ఏపీ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో శానిటేషన్ కార్మికులు పని చేస్తున్నారన్నారు. మూడు నెలల జీతాలు ఇవ్వకుంటే కుటుంబం గడవక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ నెలనెల స్లిప్పులు ఇచ్చేలా చూడాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పందించి వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. యూనియన్ నాయకులు గురుస్వామి, చెన్నయ్య, మద్దిలేటి, శివకుమార్, లక్ష్మిదేవి, నాగలక్ష్మి, కుమారి, రాజు పాల్గొన్నారు.

బాలకృష్ణమ్మ ఆశయ సాధనకు కృషి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

నంద్యాల(న్యూటౌన్): ఏపీటీఎఫ్ వ్యవస్థాపకుడు, మాజీ శాసన మండలి సభ్యుడు మార్పు బాలకృష్ణమ్మ ఆశయ సాధనకు కృషి చేస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకులు సత్యనారాయణ, సుబ్బారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మార్పు బాలకృష్ణమ్మ 12వ రాష్ట్రస్థాయి స్మారకోపన్యాస సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ శ్రీకాకుళంలో జమిందార్ల దోపిడీ, దౌర్జన్యాల నుంచి రైతులకు విముక్తి కల్పించడానికి అహర్నిశలు కృషి చేసిన మొదటి తరం కమ్యూనిస్టు నాయకుడు పద్మనాభం గుర్తుకు వస్తారని ఆయన మొదటి సంతానమే మార్పు బాలకృష్ణమ్మ అని తెలిపారు. 1930 జూన్ 13న శ్రీకాకుళం జిల్లా మందసమండలం బిన్నల మాదనాపురంలో జన్మించి 1946లో ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా, 1947లో ఉద్యమ పితామహుడిగా, 1969లో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారన్నారు. 1970లో అక్రమంగా అరెస్ట్ అయ్యారన్నారు. 1974లో శాసన మండలికి ఎన్నికయ్యారన్నారు. అప్పటి నుంచి ఏపీటీఎఫ్ ఉద్యమ పోరాటాల్లో సమన్వయం చేసిన విధానాన్ని వివరించారు. ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మి, కుల శేఖర్‌రెడ్డి మాట్లాడారు. నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, నగిరి శ్రీనివాసులు, చంగల్‌రాయమందడి, వెంకటసుబ్బయ్య, మధుసూదనరావు, సాంబశివుడు, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

రాజకీయ కక్ష సాధింపు మానుకోవాలి



డీఈఓతో మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ ఉద్యోగులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు కోరారు. ఈ మేరకు శనివారం డీఈఓ జనార్దన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. శనివారం నంద్యాలలోని డీఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు రాజునాయక్ సస్పెన్షన్‌ను రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలన్నారు. బనగానపల్లెలోని బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న రాజునాయక్‌ను ఉన్నఫలంగా సస్పెండ్ చేయడంతో వారి కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సస్పెండ్ అయిన ఉద్యోగులకు సగం జీతం ఇవ్వాలన్న నిబంధన ఉన్నప్పటికీ ఆరు నెలలుగా సగం జీతం కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, సోమన్న, శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి ప్రసాద్ ఉన్నారు.

మినీ గోకులాలతో ఆర్థికాభివృద్ధి



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎంపీడీఓ సుగుణశ్రీ

నంద్యాల(అర్బన్): మినీ గోకులాల నిర్వహణతో లబ్ధిదారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని ఎంపీడీఓ సుగుణశ్రీ అన్నారు. మండలంలోని కొత్తపల్లె, పెద్దకొట్టాల గ్రామాల్లో మినీ గోకులం షెడ్లను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. పెద్దకొట్టాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన వారిని గుర్తించి గోకులం షెడ్లు మంజూరు చేసిందన్నారు. షెడ్ల ద్వారా పాడి అభివృద్ధి చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని నిర్వాహకులకు సూచించారు. ఏపీఓ శ్రీకళారెడ్డి ఉన్నారు.



మద్దూరులో హోమం చేస్తున్న వేదపండితులు



ఉభయదారులతో స్వామివారి కల్యాణోత్సవం చేయిస్తూ..

కల్యాణం.. కమనీయం

చాగలమర్రి: మండలంలోని మద్దూరు గ్రామంలో వెలసిన లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉభయదారులుగా గ్రామానికి చెందిన ప్రవీణ్, సింధూ దంపతులు వ్యవహరించారు. ఈఓ నర్సయ్య, అర్చకులు మామిడి కిషోర్ శర్మ, సాయి శ్రవస్ శర్మ, అభినయ్ శర్మల ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, రుద్రాభిషేకం, నవగ్రహ పూజ, సుదర్శన హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి కల్యాణంలో భాగంగా పుణ్యాహవాచనం, కంకణధారణ, కన్యాదానం, యజమాని సంకల్పం, భక్త సంకల్పం, మహా సంకల్పం, మంగళ సూత్రధారణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ స్వామివారి కల్యాణం కమనీయంగా సాగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

చిన్న దుర్గన్నకు డాక్టరేట్ ప్రదానం



చాగలమర్రి: మండల కేంద్రంలోని న్యూబిల్డింగ్స్ కాలనీకి చెందిన ఎస్. చిన్న దుర్గన్న(జైపాల్)కు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈయన వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం పుల్లారెడ్డిపేటలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో సివిక్స్ లెక్చరర్ (ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్)గా విధులు నిర్వహిస్తున్నారు. రాజనీతి శాస్త్ర విభాగంలో భారతదేశం -పాకిస్తాన్ సంబంధాలు-ద్వైపాక్షిక శాంతి ప్రక్రియలో ఒక అధ్యాయనం అనే అంశంపై పరిశోధనా పత్రాలను సమర్పించడంతో డాక్టరేట్ లభించింది.

వడ్డె ఓబన్నను ఆదర్శంగా తీసుకుందాం

నంద్యాల(అర్బన్): బ్రిటీషర్ల అక్రమ పన్ను వసూళ్లను వ్యతిరేకిస్తూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలు వదిలిన వడ్డెర జాతి ఆణిముత్యం వడ్డె ఓబన్నను ఆదర్శంగా తీసుకుందామని వడ్డెర కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నంద్యాల జిల్లా అధ్యక్షుడు వడ్డె చక్రధర్ పేర్కొన్నారు. స్థానిక బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో శనివారం వడ్డె ఓబన్న జయంతిని పురస్కరించుకొని వడ్డెర సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ముస్తాక్ అహమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చక్రధర్ మాట్లాడుతూ వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో వడ్డెర హక్కులను సాధించుకునేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. నాయకులు సుబ్బరాయుడు, వడ్డె శీను, రామాంజనేయులు, గోపాల్, మధు, నాగరాజు, పుల్లయ్య, మద్దిలేటి, మనోజ్, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఏపీ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో..

వడ్డె ఓబన్న జయంతిని స్థానిక ఏపీ వడ్డెర సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, జాతీయ కార్యదర్శి శిల్పిసుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓబన్న పోరాట స్ఫూర్తిని కొనియాడారు. వెంకటేష్, మంజుల సుబ్బరాయుడు, రాఘవేంద్ర, రమణ, రామాంజులు, సుంకన్న పాల్గొన్నారు.

పశువుల పాక దగ్ధం

- రెండు దూడలు మృతి



అగ్ని ప్రమాదంలో సజీవ దహనం అయిన దూడలు

రుద్రవరం: ఎల్లాయవత్తుల గ్రామంలో శనివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ పశువుల పాక దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రెండు దూడలు మృతి చెందగా, మరో రెండు పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన సహదేవుడు, నడిపి నరసింహుడు ఇద్దరు కలసి ఒక పశువుల పాక వేసి తమ పశువులను అందులో కట్టేస్తున్నారు. ప్రమాదవశాత్తు తెల్లవారుజామున పశువులకు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అతి కష్టం మీద లోపలికి వెళ్లి పశువులను కట్టేసిన తాళ్లను తొలగించి బయటకు పంపించేశారు. ఈ ప్రమాదంలో రెండు దూడలు మృతి చెందగా.. ఐదు పశువులు స్వల్ప గాయాలతో బయటపడగా, ఓ గేదె, ఎద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. రూ. 5 లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. సమాచారం అందుకున్న పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ అక్కడికి చేరుకొని గాయపడిన పశువులకు వైద్యం అందించారు.



బాలాజీ కల్యాణ మండపంలో పుష్పాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో ద్వాదశి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): ధనుర్మాసాన్ని పురస్కరించుకొని వైకుంఠ ఏకాదశి వేడుకల అనంతరం వచ్చే ద్వాదశి వేడుకలను శనివారం పట్టణంలో గుడిపాటిగడ్డలోని శ్రీవేంకటేశ్వరస్వామి, బాలాజీకల్యాణ మండపం, సంజీవనగర్ రామాలయంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బాలాజీ కల్యాణ మండపంలో స్వామి వారికి 15రకాల పుష్పాలతో పుష్పార్చన జరిపించారు. గుడిపాటిగడ్డ ఆలయంలో స్వామి వారిని బంగారు కవచంతో అలంకరించారు. అర్చకులు కృష్ణమాచారి, ప్రహ్లాదాచారి, ఈఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.